# జీవితచిత్రాలు

## శాంతారామ్

పదేళ్ళ తర్వాత ఆ ఊరుని మళ్ళీ చూడబోతున్నాను. ఆ ఆలోచనే వళ్ళు గగుర్పొడిచేలా ఉంది. ఆ ఊరంటే ఇంత ఇష్టమున్నా ఇంతకాలం ఎందుకు వెళ్ళలేకపోయానో నాకు అర్థం కావడం లేదు. హైదరాబాదులో స్థిరపడినతర్వాత విజయవాడ చాలాసార్లు వెళ్ళాను గానీ ఆ ఊరు వెళ్ళటం కుదర్లేదు. అది మా సొంత ఊరు కాదు. నేను ఆ ఊళ్ళో మా మేనమామ ఇంట్లో ఉండి ఐదేళ్ళు అక్కడే చదువుకున్నాను. ఆ ఊరుతో అలా పెరిగిన అనుబంధమిది.

* * *

బస్సులో కూర్చున్నాక నాలో నేనే ప్రశ్నించుకున్నాను. ఆ ఊళ్ళో నాకు అన్నిటికంటే ఇష్టమైనదేమిటీ అని.

ఇష్టమైనవాటిగురించి మనకి అస్పష్టత ఏమీ ఉండదు. అందుకనే ఊరు బయట రోడ్డుమీద మామిడిచెట్టు గుర్తొచ్చింది. ముచ్చటగా వాలివుండే దాని కొమ్మలు గుర్తొచ్చాయి. బడికెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు అక్కడ ఆడుకున్న ఆటలు గుర్తొచ్చాయి.

ఆ మామిడిచెట్టు ఎవరదీ కాదు. రోడ్డు పక్కన పెరిగింది. ఆ చెట్టు సూటిగా రెండెకరాల పొలమున్న వీరాస్వామి మాత్రం ఆ చెట్టు తనదే అంటాడు. అయినా ఎవరూ అతని క్లెయిమ్‌ని పట్టించుకొనేవారు కాదు. అఖరుకి మా బడిపిల్లలు కూడా లెక్కచేసేవారు కాదు. పొలం పనులున్న రోజుల్లో వీరాస్వామి ఎప్పుడూ ఆ గట్టుమీదే కూర్చునేవాడు, అప్పుడుగాని మేము ఆ చెట్టెక్కి ఆడుకొంటే కేకలు పెట్టేవాడు. మేం దూరంగా పరుగెత్తి అక్కణ్ణించి వెక్కిరించేవాళ్ళం. వీరాస్వామి ఆ చెట్టు తనదని చెప్పుకున్నా అతనికి ఒక్క కాయ మిగిలేది కాదు. పిందెలు పడగానే పిల్లలు వాటిని రాలగొట్టేసేవాళ్ళు.

వీరాస్వామి పొలంలో ఉండని రోజులలో అయితే ఒక్కసారి మేం బడి ఎగ్గొట్టేసి ఆ చెట్టు కిందే ఆడేవాళ్ళం:

**మామిడిచెట్టు మళ్ళీ పూసింది**

చలి తగ్గిపోయి ఎండలు అప్పుడే ముదురుతుండే సీజన్‌లో ఆ చెట్టు ఎంత అందంగా ఉండేదో! చిగుళ్ళు కమ్మటి వాసనవేసేవి. ఆ సీజన్‌వి వసంత ఋతువు అంటారని బళ్ళో చెప్పినా మాకు గుర్తుండేది కాదు. మాకుమాత్రం మినపతీతల సీజను అంటేనే గుర్తు. వరి కోసిన తర్వాత చేలో మినుమో, పెసరో వేసేవాళ్ళు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అవి పంటకొచ్చేవి. వీరాస్వామి చేలో దిగి నాలుగు పెరసమొక్కలు అందుకొని, మామిడిచెట్టెక్కి బల్లపరుపుగా ఉండే ఓ కొమ్మమీద పడుకుని పెసరకాయలు తింటూ ఉంటే బడిగంటలు విన్పించేవి కావు.

అనుకోకుండా నేను అదే సీజన్‌లో ఆ ఊరు వెళ్తున్నాను. ప్రయాణం లెక్కేశాను. ఆ ఊరెళ్ళేసరికి చీకటి పడుతుంది. చీకట్లో ఆ చెట్టుని చూసేదెలా? పగలయితే బస్సుని అక్కడే ఆపి, ఆ చెట్టు కింద కొంచెంసేపుఉండి ఊరికి నడిచి వెళ్ళేవాణ్ణి. కాని అది కుదరదు.

ఆ ఊళ్ళో ఉన్న నా స్నేహితులు నన్ను గుర్తుపట్టరు. అసలు ఆ ఊళ్ళో ఎవరుంటారు? చదువు సగంలో మానేసినవాళ్ళు తప్ప. కాబట్టి నన్ను గుర్తుపట్టేది ఆ మామిడి చెట్టొక్కటే. ఆ బల్లపరుపు కొమ్మ ఒక్కటే. ఆ మామిడి చిగుళ్ళ సుగంధ మొకటే.

తీరా నేను అక్కడికెళ్ళాక ఆ చెట్టు లేకపోతే? ఈ పదేళ్ళలో ఎన్ని తుఫానులు రాలేదు! ఎన్ని చెట్లు కూలిపోలేదు! ప్రపంచంలో అన్నిటికంటే సహజమైనది విషాదమేనంటారు. అయినా అలా జరగదని నాకు గట్టి నమ్మకం. వీరాస్వామి పొలం అమ్మేసుకొని ఏ పట్నమో వెళ్ళిపోవచ్చు గానీ, ఆ చెట్టు అలాగే ఉంటుందని నా కన్పించింది. అవును, చెట్టు అలాగే ఉంటుంది. దాని కింద మరో తరం బడిపిల్లలు కేరింతలు కొడతారు. మామిడిపువ్వుల సుగంధం సోకి మృదుహృదయు లౌతారు. మనుషుల్ని ప్రేమిస్తారు.

ఊరు సమీపించేసరికి నేను సీట్లో నిటారుగా కూర్చుని బైటికిచూస్తున్నాను బస్సు నిదానంగా వెళ్తోంది. వెన్నెల రాత్రులైతే ఎంతబాగుండేది? నా దురదృష్టం కొద్దీ ఆకాశమంతా బొగ్గు గనిలా ఉంది.

ఆ చెట్టు పరిమళం దూరంనుంచే నాకు సోకింది. ఇంకో అరనిమిషంలో ఆ చెట్టుని చూడగలిగాను. మనకి ప్రియమైన వాటిని గుర్తించటానికి చీకటి అడ్డుకాదు. చెట్టు నిండుగా ఉంది.

మర్నాడు బడిపిల్లలు బయలుదేరే సమయానికి నేనూ రోడ్డుమీది కొచ్చాను. బడి ప్రక్కఊళ్ళో ఉంది. మధ్యలో ఆ అందమైన చెట్టు. మధురమైన మజిలీ.

ఈ వయసులో ఆ చెట్టుకొమ్మమీద

కూర్చుంటే అందరూ పిచ్చివాడను కొంటారేమో. బడిపిల్లలైతే బెదిరి పారిపోతారు. నాకు నవ్వొచ్చింది.

వెళ్ళి చెట్టుకింద కూర్చున్నాను. చల్లగా ఉంది. వీరాస్వామి కనబడలేదు. దూరంగా బడిపిల్లలు కన్పించారు, ఎగిరొస్తున్న పావురాల్లా. నాకు బలే ఆనందమేసింది. ఇష్టాలు ఒకదానితో ఒకటి ముడిపడిఉంటాయి. మామిడి చెట్టుకు లతలా చుట్టుకున్న బాల్య స్మృతుల్లా. చెట్టుకింద చిన్నపిల్లలు ఆడుకొంటేనే పరిపూర్ణ ఆనందం.

పిల్లలు దగ్గరికొచ్చారు. అందరూ ఒకే డ్రెస్ వేసుకొన్నారు. పక్క ఊళ్ళో కాన్వెంటు పెట్టారని తెలుస్తూనే ఉంది. పిల్లలు క్రమశిక్షణగల సైనికుల్లా నడుస్తున్నారు గానీ వాళ్ళ మొహాల్లో బాల్యం కన్పించడంలేదు నా కెందుకో చాలా బాధ అన్పించింది. వీళ్ళకి ఈ చెట్లని చూసినా. ఈ పొలాల్ని చూసినా ఏమీ అన్పించదా? వీళ్ళు ఆటలాడుకోరా? ప్రపంచం ప్రకృతికి దూరమైపోతున్నదా నా చిన్నప్పటి స్నేహితులు గుర్తొచ్చారు నర్సింహం ఎప్పుడూ చిరిగిన లాగూలే వేసుకొచ్చేవాడు. అయినా వాడి మొహంలో ఎంత ఆనందం కన్పించేదని! చెట్టెక్కి ఆ కొమ్మ మీదనుంచి ఈ కొమ్మమీదకి గెంతేవాడు. కాన్వెంటు పిల్లలందరూ వెళ్ళిపోయారు. టైం అయిపోయిందని వాళ్ళు ఈ చెట్టుకింద ఆగిఉండరేమో అన్పించింది. టైం చూసుకున్నాను. అదే కావచ్చు.

పక్క ఊరెళ్ళి అటూఇటూ తిరిగి సాయంత్రానికి మళ్ళీ ఆ చెట్టు కింద చేరాను. స్కూలు వదిలే సమయమది. బ్యాగులుతగిలించుకొనివస్తున్న ఆపిల్లలు బస్తాలు మోస్తున్న కార్మికుల్లా ఉన్నారు. వాళ్ళు అన్ని పుస్తకాలు మోస్తున్నారు. చెట్టుకు దూరంగా వెళ్ళి కూర్చున్నాను. నాకు చాలా కుతూహలంగా ఉంది. పిల్లలు చెట్లకింద ఆడుకోకపోవడం నాకిప్పటికీ వింతగా ఉంటుంది!

ఆ పిల్లలది అదే నడక. కనీసం చెట్టుకేసైనా చూడ్డంలేదు. పిల్లలు చెట్టు దాటిపోయారు. నాకు బాధవేసింది. వెళ్ళి మీకు ఆటలురావా అని కోపంగా అడగాలన్పించింది వేగంగా అడుగులేసి బాబూ అని పిల్చాను. చివర్న నడుస్తున్న కుర్రాడు అగాడు. పదేళ్ళుంటాయి. మీరు ఆటలాడుకోరా అని అడిగాను. స్కూల్లో డ్రిల్లు చేస్తామని చెప్పాడు.

మామిడిచెట్టు మళ్ళీ పూసింది. చెట్టుకేసి చూపించి దానిని చూస్తుంటే నీకేమీ అన్పించడంలేదా అని అడిగాను: కుర్రాడు అమాయకంగా చూసి ఊరుకేసి పరుగెత్తాడు. *